కిడ్నీ రోగులకు కొండంత అండ

- వ్యాధిగ్రస్తులకు కార్పొరేట్ వైద్యం
- రోజుకు 57 మందికిపైగా వైద్య సేవలు
- రూ.10వేలు పింఛన్


ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ నిర్వహిస్తున్న వైద్యులు

మాచర్ల రూరల్: కిడ్నీ బాధిత నిరుపేదల రక్షణకు రక్తశుద్ధి (డయాలసిస్) విభాగం మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో కార్పొరేట్ వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రికి దీటుగా డయాలసిస్ వైద్య సేవలందిస్తూ ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఆరోగ్య భరోసా కల్పిస్తుంది. వ్యాధి తీవ్రతను బట్టి వారానికి 2, 3 సార్లు ఈ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్నది. వారానికి రూ.5 వేలకు పైగా ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇన్నాళ్లు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తూ అనారోగ్యంతో పాటు, ఆర్థిక భారంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. అలాంటి వారికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తుంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా డయాలసిస్ చేయించుకునే సౌకర్యాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చొరవతో మాచర్ల ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

57 మందికి ఉచిత డయాలసిస్ సేవలు..

ప్రభుత్వ వైద్యశాలలో రోజు 57 మందికి వైద్య సేవలందుతుండగా, నెలకు 500ల మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. వీరిలో కొంత మందికి మూడు సార్లు, మరి కొంత మందికి 2 సార్లు, కొందరికి ఒకసారి చొప్పున డయాలసిస్ చేయవలసి ఉంటుంది. నెఫ్రాలజీ డాక్టర్ సేవలందిస్తున్నారు.

అత్యాధునిక వైద్య సేవలు..

డయాలసిస్ కేంద్రంలో అత్యాధునిక వైద్య సేవల యంత్రాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటి ద్వారా డయాలసిస్ బాధితులకు రక్తశుద్ధి చేస్తూ వారికి ఆర్థిక భారం నుంచి గట్టెక్కిస్తూ ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో మాచర్ల కేంద్రంగా ఇలాంటి వైద్య సేవలు అందిస్తుండటంతో వెల్దుర్తి, దుర్గి, కారెంపూడి, రెంటచింతల, గురజాల, నాగార్జున సాగర్ ప్రాంతాల నుంచే కాకుండా తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా రోగులు వైద్య సేవలు పొందటం గమనార్హం.

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా డయాలసిస్..



24 గంటలు వైద్యశాలలో కిడ్నీ బాధితులకు సేవలందించటం జరుగుతుంది. ఆసుపత్రిలో అత్యాధునిక యంత్రాలతో నెఫ్రాలజీ వైద్యుల పర్యవేక్షణలో సుమారు 57 మందికి డయాలసిస్ చేస్తున్నాం. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నాం.

–డాక్టర్ ఉదయభాను, సూపరింటెండెంట్

కిడ్నీ బాధితులకు ఆరోగ్య, ఆర్థిక భరోసా..



వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో కార్పొరేట్ స్థాయిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో కిడ్నీ బాధితులకు ఆరోగ్య, ఆర్థిక భరోసా కల్పించాము. నిరుపేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు జరిగింది. కిడ్నీ బాధితులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పింఛన్ సదుపాయాన్ని కల్పించింది. వీరికి ప్రతి నెలా రూ.10వేలు ఆర్థిక సాయం అందిస్తుంది. వారికి ఆరోగ్య రక్షణతో పాటు, ఆర్థిక భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ,ప్రభుత్వ విప్

క్లుప్తంగా

స్థానిక ఓటు తొలగించకూడదు

తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి



పిడుగురాళ్ల: స్థానికంగా నివసిస్తున్న వారి ఓటు ఎట్టిపరిస్థితిలోను తొలగింపు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందని తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా నివసిస్తున్న అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు నమోదు అయి ఉండాలని, అలాగే మృతి చెందిన వారి ఓటును జాబితాలో నుంచి తొలగించాలని, అందుకు సమగ్ర సర్వే నిర్వహించి, జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో కాకుండా రెండు, మూడు ప్రాంతాలలో ఓటు ఉంటే ఒక చోట ఉండేలా చర్యలు తీసుకొని, మిగిలిన ప్రాంతాల్లో రద్దు చేయాలని సూచించారు. నూతనంగా ఓటు హక్కు పొందేవారికి వారి వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. ఓటు హక్కు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి కల్పించాల్సిన బాధ్యత ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ధనలక్ష్మీ, ఆర్ఐ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి

గురజాల : విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన పేరుపోగు శ్రీహరి (28) కాలనీలో ఉన్న మంచినీటి కుళాయి వద్దకు వెళ్లగా కుళాయిలో నీరు రాకపోవడంతో పక్కనే ఉన్న మీటర్ వద్దకు స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లాడు. స్విచ్ ఆన్ చేస్తున్న సమయంలో స్విచ్ బోర్డుకు విద్యుత్ రావడంతో అక్కడికక్కడే కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే శ్రీహరిని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు శ్రీహరిని పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కలరు. మృతుడి భార్య శ్రావ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పిడుగురాళ్లలో 10న ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంప్

పిడుగురాళ్ల: ఈ నెల 10వ తేదీన పిడుగురాళ్ల పట్టణంలో ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంప్ నిర్వహించటం జరుగుతుందని, ఆయుర్వేదిక్ డాక్టర్ మేఘమాల మంగళవారం తెలిపారు. ఈ ఉచిత ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంప్ జానపాడు రోడ్డులోని ఆర్య వైశ్య వాసవీ కల్యాణ మండప ఆవరణలో నిర్వహించటం జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ ప్రజలతోపాటు గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మేఘమాల కోరారు.

నేడు జల్ దివాలి కార్యక్రమం

పిడుగురాళ్ల: పట్టణంలోని చెరువు కట్ట బజారు నందలి పంప్ హౌస్ వద్ద జల్ దీవాలి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తామని, స్వయం సహాయక సంఘ మహిళలకు జల శుద్ధి, సరఫరాపై అవగాహన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

బైండోవర్ కేసు నమోదు

కారెంపూడి: మండలంలోని వేపకంపల్లి గ్రామానికి చెందిన బొల్నేడి శ్రీనివాసరావుపై మంగళవారం బైండోవర్ కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఎం రామాంజనేయులు తెలిపారు. బైండోవర్ చేసిన శ్రీనివాసరావును తహసీల్దార్ జి.శ్రీనివాస్ యాదవ్ ఎదుట హాజరుపర్చారు. రూ.5 లక్షలు సొంత పూచీకత్తు ఇచ్చి విడుదలయ్యారు. వేపకంపల్లి గ్రామంలో అశాంతిని ప్రేరేపించే ఘటనలకు పాల్పడిన కేసు ఉందని మళ్లీ ఏదైనా అశాంతిని ప్రేరేపించే పనులకు పూనుకుంటాడనే అనుమానంతో బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామాలలో శాంతికి భంగం కలిగించే వారిపై కేసులు

సీఐ జయకుమార్

కారెంపూడి: కారెంపూడి సర్కిల్ పరిధిలో సమస్యాత్మకంగా ఉన్న గ్రామాలలో ఎవరైనా ఎలాంటి అవాంఛనీయ, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడినా వారిపై బైండోవర్ కేసులు పెట్టడం జరుగుతుందని అవసరమైతే క్రిమినల్ కేసులు కూడా పెడతామని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ మంగళవారం రాత్రి హెచ్చరించారు. కారెంపూడి మండలం వేపకంపల్లి గ్రామానికి చెందిన ఒకరిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. కారెంపూడి సర్కిల్ పరిధిలోని కారెంపూడి, దుర్గి, రెంటచింతల మండలాలలోని సమస్యాత్మక గ్రామాలపై ఎస్ఐలు నిఘా పెట్టాలని ఆదేశించామన్నారు. గ్రామాలలో ఎవరైనా విద్వేషాలు రెచ్చగొట్టి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ జయకుమార్ హెచ్చరించారు.

రెంటచింతలలో కుక్కల పట్టివేత


రెంటచింతలలో ఊర కుక్కలను పట్టిస్తున్న గ్రామ పంచాయతీ వారు

సాక్షి ఎఫెక్ట్

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో మంగళవారం ఊరకుక్కల పట్టివేత కార్యక్రమాన్ని గ్రామ పంచాయతీ అధికారులు చేపట్టారు. అక్టోబర్ 30న రెంటచింతల గ్రామంలోని పలు కాలనీలలో ఊరకుక్కలు, కోతుల వలన గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను సాక్షి దినపత్రికలో స్వైర విహారం చేస్తున్న కుక్కలు, కోతులు అనే శీర్షికతో ప్రచురితం కావడంతో గ్రామ పంచాయతీ వారు కుక్కల ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని వివిధ కాలనీలలో సంచరిస్తున్న 73 కుక్కలను పట్టుకుని సత్రశాల సమీపంలోని అడవి ప్రాంతంలో విడిచిపెట్టినట్లు సర్పంచ్ పేర్ల చౌడమ్మ, కార్యదర్శి అనంత కోటేశ్వరరావు తెలిపారు. గ్రామంలో పూర్తి స్థాయిలో కుక్కల పట్టివేత కార్యక్రమం ముగిసిన తరువాత కోతులను పట్టుకునే చర్యలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కొంత కాలంగా కుక్కలు, కోతుల కారణంగా అనేక ఇబ్బందులు పడిన గ్రామస్తులు గ్రామ పంచాయతీ వారు కుక్కల పట్టివేత పనులు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాచర్ల వాసి మచిలీపట్నంలో మృతి



కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ యాచకుడు మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా మాచర్ల గ్రామానికి చెందిన నక్షత్రపు వెంకటేశ్వరరావు (60) మచిలీపట్నం రాజుపేట ప్రాంతంలో కొన్ని రోజులుగా యాచిస్తూ తిరుగుతున్నాడు. పది రోజుల కిందట అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం చుట్టుపక్కల వ్యాపారులు మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న అతడు మంగళవారం మృతి చెందాడు. మృతుని తరఫు బంధువులు ఎవరైనా ఉంటే సెల్: 83329 83788, 94407 96414, 94407 96412 నంబర్లను సంప్రదించాలని సీఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

హత్యాయత్నం కేసులో జైలు శిక్ష

గురజాల : హత్యాయత్నం కేసులో భర్తకు మూడేళ్ల జైలు శిక్ష రూ.5 వేలు జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బీఎల్‌వీ శేషాద్రి మంగళవారం తీర్పునిచ్చారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బండి వీరభద్రుడు తెలిపిన వివరాల ప్రకారం....పిడుగురాళ్లకు చెందిన తమ్మిశెట్టి మార్తమ్మ వెంకటేశ్వర్లుకు వివాహం జరగ్గా వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వెంకటేశ్వర్లుకు ముందుగానే వివాహం జరిగిందన్న విషయం మార్తమ్మకు చెప్పకుండా వివాహం చేసుకున్నాడు. పిడుగురాళ్లలో కూలీ పనులు లేకపోవడంతో గుంటూరులోని నల్లచెరువులో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. భర్త వెంకటేశ్వర్లు చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బులు కోసం భార్యను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. భర్త వేధింపులు తట్టుకోలేక గుంటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినప్పటికి వెంకటేశ్వర్లు ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విసిగి పోయి గుంటూరు నుంచి పిల్లలతో పిడుగురాళ్లకు వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. పిల్లలతో జీవనం కష్టంగా ఉందని మార్తమ్మ పిడుగురాళ్ల కోర్టులో భరణం కేసు వేయగా కోర్టు భరణం ఇవ్వాలని తెలిపినా వెంకటేశ్వర్లు ఇవ్వడం లేదు. ది.06.05.2017వ తేదీన మార్తమ్మ ఇంటిలో ఉండగా భర్త వెంకటేశ్వర్లు పిల్లలను తీసుకుని గుంటూరుకు రమ్మని అడగ్గా ఆమె రానని సమాధానం చెప్పడంతో ఆగ్రహించిన భర్త పక్కనే ఉన్న చీర తీసుకుని ఆమె మెడకు వేసి చంపడానికి ప్రయత్నించగా, ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో అక్కడి నుంచి వెంకటేశ్వర్లు పారిపోయాడు. స్థానికుల సహకారంతో పిడుగురాళ్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువు కావడంతో పై విధంగా అసిస్టెంట్ సెషన్ జడ్జి తీర్పునిచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అచ్చంపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, గుంటూరు వారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి అండర్–19 రెజ్లింగ్(కుస్తీ) పోటీలు బాలురకు, బాలికలకు వేరువేరుగా జరిగాయి. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికచేశారు. బాలికల విభాగంలో బాపట్లకు చెందిన పి.భూమిక, కె.సుమలత, పి.సౌమ్య, వీపీసౌత్‌కు చెందిన డి.గౌతమి, కె.భ్యూల, ఎల్.బంగారీలు ఎంపికయ్యారు. బాలురు గ్రీకో ఫ్రీస్టైల్ విభాగంలో అచ్చంపేటకు చెందిన కె.లాలునాయక్, ఎస్.వంశీ, బి.విజయబాబు, బి.సాగర్‌లు ఎంపికయ్యారు. గ్రీకో రామన్ విభాగంలో అచ్చంపేటకు చెందిన కె.కిరణ్‌కుమార్, బి.మహేంద్ర, జి.ఇస్సాకు, కె.ప్రభాకర్, బి.అద్భుతకుమార్, నరసరావుపేటకు చెందిన వై.మల్లిఖార్జున, అచ్చంపేటకు చెందిన షేక్ రబ్బానిలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 11, 12, 13 తేదీలలో కృష్ణా జిల్లా, నున్నలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారు. పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ టి.అరుణ్‌కుమార్ ప్రారంభించగా, పాఠశాల పీడీ గుడిపూడి భూషణం అంపైర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలు పాఠశాలల విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా అందజేత



సత్తెనపల్లి: పట్టణంలోని 6వ వార్డుకు చెందిన మాగం రాజు (43) కొద్దిరోజుల క్రితం గుండె పోటుతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ బీమాలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు మృతుని భార్య నాగేశ్వరికి వైఎస్సార్ సీపీ నాయకుడు సదనం హరి చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ అధికారి రెహమాన్, వైఎస్సార్ సీపీ నాయకులు ఏసుబాబు, కృపారావు, చంటి తదితరులు ఉన్నారు.

నేత్రాల పట్ల అప్రమత్తత అవసరం

సత్తెనపల్లి: నేత్రాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సత్తెనపల్లి రూరల్ సీఐ పీ ప్రేమయ్య అన్నారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో పట్టణంలోని 16వ వార్డు చెంచు కాలనీలో మంగళవారం పేదలకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని అవయవాల కన్నా కళ్ళు ముఖ్యమైనవని, కనుక ప్రతి ఒక్కరూ నేత్రాల పట్ల కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది నేత్ర పరీక్షలు నిర్వహించి 62 మందికి కళ్ళజోళ్ళు అందించారు. కార్యక్రమంలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఇన్‌చార్జ్ సత్యనారాయణ, చర్చి ఫాదర్ పి.వి జయ్ కుమార్, 16వ వార్డు మాజీ కౌన్సిలర్ నందిగం ఆదాం, ఫ్రెండ్స్ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

రబీలో సబ్సిడీపై శనగ విత్తనాలు


రైతులతో మాట్లాడుతున్న సాయి మార్కొండారెడ్డి

కారెంపూడి: రబీలో వేసుకునేందుకు వీలుగా యాభై శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించడానికి సిద్ధంగా ఉన్నాయని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి తెలిపారు. ఆయన కారెంపూడిలోని రైతు భరోసా కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారెంపూడి మండలానికి 10 టన్నుల శనగ విత్తనాలు వచ్చాయని తెలిపారు. యాభై శాతం సబ్సిడీపై వాటిని రైతులకు అందించనున్న వెల్లడించారు. ఆర్బీకేలలో యూరియా, డీఏపీ ఎరువులు కూడా ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. కారెంపూడిలోని రెండు ఆర్బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను చైర్మన్ సాయి మార్కొండారెడ్డి సమీక్షించారు. కారెంపూడిలో 667 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా అందిస్తున్నామని, అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పని చేస్తోందని వైఎస్సార్ రైతు భరోసాను క్రమం తప్పక అందించడంతోపాటు ఆర్బీకేలు ఏర్పాటు చేసి వాటి ద్వారా విత్తనాల నుంచి ఎరువుల వరకు రైతులకు వారి స్వగ్రామాలలోనే అందిస్తుందన్నారు. పంటలకు మద్దతు ధరను కల్పిస్తోందన్నారు. పల్నాడు ప్రజల చిరకాల స్వప్నం వరికెపూడిశల ప్రాజెక్టు కలను కూడా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అవిరళ కృషితో సాకారం అవుతోందని అది పూర్తయితే పల్నాడు ప్రజలకు తాగు, సాగు నీటి సమస్య ఉండదని పేర్కొన్నారు. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనుందని తెలిపారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు గ్రూపులతో పాటు వ్యక్తిగతంగా కూడా స్ప్రేయర్లు, టార్పాలిన్‌లు లాంటి వ్యవసాయ యంత్ర పరికరాలు అందించే విషయం పరిశీలించాలని రైతులు కోరారు. ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు ప్రమీలా భాయితేజానాయక్, ఎంపీటీసీ సభ్యులు బొమ్మిన అల్లయ్యసావిత్రి, పార్టీ నాయకులు పాతూరి రామిరెడ్డి, చల్లా వీర్లవరప్రసాదరావు, సూరె సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి



రెంటచింతల: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్ వచ్చే ప్రమాదం పొంచి ఉందని ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే విష జ్వరాల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చున్నారు. ప్రస్తుతం మండలంలో కురుస్తున్న వర్షానికి దోమల ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని వివరించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని, ఇంటి కిటికీలకు మెష్‌లను వాడాలని, జ్వరం వచ్చిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని, ఇంటి పరిసరాలలో చెత్తను తొలిగించాలని, పరిసర ప్రాంతాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వారానికి ఒక్కసారి నీటి తొట్లను ఖాళీ చేసి మరుసటి రోజు నింపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు చెన్నంశెట్టి అంకమ్మరావు, సీహెచ్ఓ పూజల నాగేశ్వరరావు తదితరులున్నారు.

గ్రామాలలో మౌలికవసతుల ఏర్పాటుకు కృషిచేస్తాం


బోరు భూమిపూజలో జెడ్పీ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, నేతలు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో మౌలిక వసతుల ఏర్పాటుకు జిల్లా పరిషత్ నిధులు కేటాయించి తన వంతు కృషిచేస్తానని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంరిరెడ్డి నర్సిరెడ్డి, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని తుమృకోట గ్రామంలో మండల ప్రజా పరిషత్ నిధులతో ఏర్పాటు చేస్తున్న 3 బోర్లకు వారు సర్పంచ్ నల బాలునాయక్, పార్టీ నేతలతో కలిసి భూమి పూజా కార్యక్రమాలను నిర్వహించి మాట్లాడారు. మండలంలోని గ్రామాలలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చేయుతనిస్తామన్నారు. గ్రామాలలో మంచినీటి బోర్లు, అంతర్గత మురుగుకాల్వలు, పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డిల సూచనల మేరకు మండల ప్రజా పరిషత్ నిధులతో గ్రామంలోని యాదవుల బజారులో, ముస్లిం బజారులో, ఎస్సీ కాలనీలో మూడు బోర్లు, మోటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నలబాలునాయక్, ఎంపీటీసీలు షేక్ జానీ భాష, షేక్ సుభాన్‌బీ, వైఎస్సార్ సీపీ నాయకులు పోట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పల్లెకు చేరువైన వైద్యం.. పెరిగిన భరోసా



వైఎస్సార్ హెల్త్ క్లినిక్

- పేదలకు కార్పొరేట్ వైద్యం
- సురక్ష శిబిరాలలో 6,841 మందికి వైద్యసేవలు


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలు (ఫైల్)


గడప వద్దే వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

కారెంపూడి: ప్రభుత్వం విద్యతో పాటు వైద్యాన్ని కూడా చేరువ చేయడంతో పేద, మధ్య తరగతి ప్రజల్లో పూర్తి సంతృప్త స్థాయిలు కన్పిస్తున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఇది మరింత పెరిగింది. సురక్ష శిబిరాలకు వెల్లువలా తరలివచ్చిన ప్రజలు అక్కడ అందిన వైద్య సేవలతో సంతృప్తిగా ఇంటికి వెళ్లారు. కారెంపూడి మండలంలో నిర్వహించిన 11 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో 6,841 మంది పేదలకు ఉచిత వైద్య సేవలందాయి. అలాగే 1,748 మందికి కంటి పరీక్షలు చేశారు.

ఇన్నాళ్లకు మంచి వైద్యం అందుతోంది...



చిన్నప్పటి నుంచి రెక్కల కష్టం చేశా. ఆరోగ్యం పట్ల ధ్యాస ఉండేది కాదు. నలతగా ఉన్న బతకడం కోసం పని అవసరంతో పనులకు వెళ్లేవాళ్లం. నాకు బీపీ, ఒళ్లు నొప్పుల సమస్యలు వచ్చాయి. గతంలో దూరంలో ఉన్న ఆసుపత్రికి వెళ్తే మందులిచ్చేవారు. డాక్టర్లు కూడా సరిగా ఉండేవారు కాదు. ఇప్పుడు 104 బండి మా గ్రామానికి వచ్చి మందులిచ్చి వెళ్తున్నారు. గ్రామంలో కూడా ఎప్పుడంటే అప్పుడు వెళ్లి చూపించుకోడానికి కొత్తగా హెల్త్ క్లినిక్‌లు పెట్టారు. జగన్ పాలన బాగుందయ్యా. ఇన్నాళ్లు మమ్మల్ని సరిగా పట్టించుకోలేదు, కానీ ఇప్పుడు జగన్ డాక్టర్లను మా ఊరికి పిలిపించి మాకు వైద్యం అందిస్తున్నారు.

– తవిటి సింగరయ్య, బట్టువారిపల్లె, కారెంపూడి మండలం

ఇప్పుడు భయపడడం లేదు..



అంతకు ముందు ఆసుపత్రికి వెళ్లాలంటే భయం. డాక్టర్లుండే వారు కాదు. అక్కడకు వెళ్తే అందరికి అవే మందులిస్తారనుకునే వాళ్లం. ఇప్పుడు అలా కాదు. ఆసుపత్రిలో ఇద్దరు డాక్టర్లుంటున్నారు. బీపీ చూస్తున్నారు. అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. నాకు జ్వరం వస్తే రక్త పరీక్ష చేసి అది టైఫాయిడ్ కాదని నిర్ధారించిన తర్వాత మందులిచ్చారు. మాకు కూడా తృప్తిగా ఉంది. చిన్న జబ్బులకు భయపడాల్సిన పని లేదనే ధీమా వచ్చింది. పెద్ద ఇబ్బంది వచ్చినా అన్ని సౌకర్యాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. చాలా సంతోషంగా ఉంది. మా ఊళ్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చాలా మంది చూపించుకుని మందులు వాడుతూ ఇబ్బంది లేకుండా ఉంటున్నారు.

– మల్లా తిరుపతమ్మ, గాదెవారిపల్లె

మామిడి తోటలను పరిశీలించిన ఉద్యాన అధికారి



రాజుపాలెం: పండ్ల తోటలకు డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకుంటే మొక్కలకు నీళ్లు అందుబాటులో ఉంటాయని ఉద్యాన అధికారి డి.నవీన్ తెలిపారు. మండలంలోని అనుపాలెం గ్రామ సమీపంలోని మామిడి తోటలను ఉద్యాన అధికారి మంగళవారం పరిశీలించారు. రైతులకు యాజమాన్య పద్ధతులను వివరించారు. తోటలకు పెట్టే నీటిని పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఉద్యాన సహాయకుడు రమేష్, రైతు సూర్యనారాయణ పాల్గొన్నారు.